# కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పరిశ్రమల మూతే

**ఎల్బీనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి**



నాగోలులో మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్/ఎల్బీనగర్, నవంబర్ 13: కర్ణాటక రాష్ట్రంలో ఐదు గంటల కరెంటు ఇవ్వలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నదని బీఆర్ఎస్ ఎల్బీనగర్ అభ్యర్థి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం నాగోలు, బీఎన్‌రెడ్డినగర్, కొత్తపేట డివిజన్లలో ఇంటింటి ప్రచారం, కార్యకర్తల సమావేశం, పార్టీ చేరికల కార్యక్రమాల్లో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. కాలనీల్లో పాదయాత్ర చేపట్టిన ఎమ్మెల్యేకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ 24 గంటల పాటు కరెంటు ఇచ్చే బీఆర్ఎస్ సర్కారు కావాలో 3 గంటలు కరెంటు ఇస్తామంటున్న కాంగ్రెస్ పార్టీ కావాలో ప్రజలే తేల్చుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఎప్పుడు కరెంటు ఉంటుందో.. ఎప్పుడు పోతుందో తెలియక తెలంగాణలో పరిశ్రమలు మూత పడటం ఖాయమని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మూలకుపడ్డ ఇన్వర్టర్లు రిపేరు చేయించుకోవల్సిందేనని హెచ్చరించారు. నిజామాబాద్ ఎంపీగా పని చేసిన మధుయాష్కిగౌడ్ తన ఎంపీ పరిధిలోని ఏడు సెగ్మెంట్లలో పోటీ చేసే ధైర్యం లేక ఎల్బీనగర్‌కు వచ్చారని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి విమర్శించారు. నిజామాబాద్ నుంచి ప్రజలు తరిమికొడితే ఇక్కడికి వచ్చి పడ్డారని, ఎల్బీనగర్‌లో ఏ మూల ఏ కాలనీ ఉందో ఆయన తెలుసుకునే లోపు ఎన్నికలు పూర్తవుతాయన్నారు. నిజామాబాద్‌లో చెల్లని రూపాయి హైదరాబాద్‌లో చెల్లుతుందా అన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గోనె ప్రకాశ్‌రావు గతంలో మధుయాష్కి మీద సంచలన వ్యాఖ్యలు చేశారని తెలిపారు. దొంగ వీసాలు, నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఎంతో మందిని మోసం చేశారని మధుయాష్కి మీద పోలీస్టేషన్‌లో 420 కేసులు నమోదు అయ్యాయని, ఈ విషయాన్ని స్వయంగా గోనె ప్రకాశ్‌రావు తెలిపారన్నారు. అందుకు సంబంధించిన సాక్ష్యాలు యూట్యూబ్‌లో ఉన్నాయన్నారు. బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డిది కబ్జాల సంస్కృతి అని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. సొంత బంధువుల పొలాలను కబ్జా పెట్టడం వల్ల ఆయన బంధువులే సామ రంగారెడ్డిపై దాడి చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. తాను చేసిన అభివృద్ధి పనులే తనను గెలిపిస్తాయని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్ తరలించడంతో పాటు టిమ్స్ వైద్యశాలను నిర్మిస్తున్నామని, ఇండ్ల రిజిస్ట్రేషన్ సమస్యలను పరిష్కారం చేశామని, పార్కులను సుందరీకరించామని, చెరువుల అభివృద్ధిని చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, లింగాల నాగేశ్వర్‌రావు, అనంతుల రాజారెడ్డి, మాజీ కార్పొరేటర్లు చెరుకు సంగీత ప్రశాంత్ గౌడ్, జీవీ సాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, వైశ్విక్ రాజ్‌పుత్ క్షత్రియ మహాసభ జాతీయ ఉపాధ్యక్షుడు, తెలంగాణ బొందిల్ ట్రస్టు బోర్డు ట్రస్టీ, మహారాణా ప్రతాప్ ట్రస్టు బోర్డు లీగల్ అడ్వయిజర్, మోహన్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు టాకూర్ గజేంద్ర సింగ్‌తో పాటుగా పలువురు నాయకులు, యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మోహన్‌నగర్ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి గులాబీ కండువా కప్పి గజేంద్ర సింగ్‌ను పార్టీలోకి ఆహ్వానించారు. గజేంద్ర సింగ్‌తో పాటుగా రాజ్‌పుత్ మహాసభ ప్రతినిధులు, మోహన్‌నగర్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.



ఎమ్మెల్యే కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన లోక్‌సత్తా పార్టీ నేతలు

# మహిళలకు అండగా సర్కారు

**కూకట్‌పల్లి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కృష్ణారావు**

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 13 : సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు, పేదలకు అండగా ఉంటూ చేయూతనందిస్తున్నదని కూకట్‌పల్లి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్ కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు బైరెడ్డి రాధికరెడ్డి ఆధ్వర్యంలో 50 మంది మహిళా కాంగ్రెస్ నేతలు ఎమ్మెల్యే కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. లోక్‌సత్తా పార్టీకి చెందిన షేక్ వాసీమ్, షేక్ అజీత్‌లతో పాటు 35 మంది పార్టీ నేతలు, కార్యకర్తలు కలిసి ఎమ్మెల్యే కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీలో చేరిన నాయకులంతా బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. సమాజంలో అన్ని వర్గాలకు సమప్రాధాన్యతనిస్తూ.. సమర్థవంతమైన పాలన అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని చెప్పారు. కాగా, కూకట్‌పల్లి బీజేపీ పార్టీకి బిగ్‌షాక్ తగిలింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బీజేపీ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షుడు కృష్ణ ముదిరాజ్, బాలాజీనగర్ డివిజన్ బీజేపీ పార్టీ మహిళా అధ్యక్షురాలు మంగమ్మ ముదిరాజ్‌లు బీజేపీ పార్టీకి రాజీనామా చేసి... బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

# బీఆర్ఎస్‌లోకి సెంట్రింగ్ మేస్త్రీల సంఘం



శామీర్‌పేటలో సెంట్రింగ్ మేస్త్రీల సంఘం సభ్యులకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి

శామీర్‌పేట, నవంబర్ 13 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మి సెంట్రింగ్ మేస్త్రీల సంఘం సభ్యులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం శామీర్‌పేట మండలంలోని సెంట్రింగ్ మేస్త్రీల సంఘం సభ్యులు బీఆర్ఎస్ పార్టీలో చేరగా, వారికి గులాబీ కండువాకప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశానికే ఆదర్శమన్నారు.

# ఆదర్శవంతమైన పాలన అందిస్తున్న సీఎం కేసీఆర్

**-కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత**
**-బీఆర్ఎస్‌లో భారీగా మైనార్టీ నేతల చేరిక**



గులాబీ కండువా కప్పి మైనార్టీ నేతలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత

కంటోన్మెంట్, నవంబర్ 13: తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో దేశ ప్రజల దృష్టి సీఎం కేసీఆర్ వైపు మళ్లిందని కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత అన్నారు. సోమవారం కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన మైనార్టీ నాయకులు సయ్యద్ సిరాజ్ ఆధ్వర్యంలో, రెండో వార్డు నుంచి మైనార్టీ నేతలు టీఎన్ శ్రీనివాస్ నేతృత్వంలో వందలాదిగా బీఆర్ఎస్‌లో చేరారు. ఈ మేరకు కంటోన్మెంట్ ఎన్నికల ఇన్‌చార్జి ఎంఎన్ శ్రీనివాస్‌తో కలిసి కార్ఖానాలోని తన క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత వారికి గులాబీ కండువా కప్పి, బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం లాస్యనందిత మాట్లాడుతూ రాష్ట్రంలో ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ తాగునీటిని అందిస్తూ దేశంలోనే ఆదర్శవంతమైన పాలనను సీఎం కేసీఆర్ అందిస్తున్నారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రజలు స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు చెప్పారు. ఎన్నికల్లో కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమన్నారు. మైనార్టీలకు పెద్ద పీట వేస్తున్న ఘనత కేసీఆర్ సర్కారుదేనని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నర్సింహ ముదిరాజ్, కుమార్ ముదిరాజ్, నరేశ్, శ్రీనివాస్, ఆంజనేయులు, దేవులపల్లి శ్రీనివాస్, జిలానీ, నర్సింహ, నాగరాజు, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లో చేరిన టీడీపీ నేత



మాజీ టీడీపీ నాయకుడు, కేపీహెచ్‌బీలోని ప్రగతి విద్యా సంస్థల చైర్మన్ సంకినేని శ్రీధర్‌రావు బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సమక్షంలో సోమవారం శ్రీధర్‌రావు గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమాల ఫలితంగా సాధించుకున్న తెలంగాణ సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఎంతో అభివృద్ధి జరుగుతున్నదని, సంక్షేమ పాలన నచ్చి తాను బీఆర్ఎస్‌లో చేరినట్లు శ్రీధర్‌రావు తెలిపారు. ఆయనతో పాటు రత్నాజీ, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, దినేశ్, శివ, సాయిరాం, దేవరాజ్, కేవెన్‌లు సైతం పార్టీలో చేరారు.

**- మియాపూర్ , నవంబర్13**



ఎంఎస్ మక్తాలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇస్త్రీ చేస్తున్న ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దానం నాగేందర్

*- బంజారాహిల్స్, నవంబర్ 13*

# సికింద్రాబాద్ బీజేపీలో కలకలం

**బీజేపీకి బండపల్లి సతీశ్ రాజీనామా**

సికింద్రాబాద్, నవంబర్ 13: సికింద్రాబాద్‌లో బీజేపీకి భారీ షాక్ తగిలింది. సీనియర్ నేత, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండపల్లి సతీశ్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి తన రాజీనామా లేఖను పంపారు. రాజీనామా లేఖలో బీజేపీపై ఆరోపణలు చేశారు. బీజేపీ నాయకత్వ వ్యవహార శైలిపై అసంతృప్తితో ఉన్న ఆయన రాజీనామా ఇచ్చారు. సోమవారం సికింద్రాబాద్ లోని తన నివాసంలో అనుచర వర్గంతో సమావేశమయ్యారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ ...సికింద్రాబాద్ అసెంబ్లీ టికెట్ ఆశించానని.. కానీ పార్టీ అధిష్ఠానం తనకు కాకుండా అర్హత లేని వ్యక్తికి టికెట్ ఇచ్చిందన్నారు. బీజేపీ కోసం ఎంతగానో పనిచేశానని, పదేండ్లుగా పార్టీకి ఎంతో సేవలు అందించానని, అయినా పార్టీ తన కష్టాన్ని గుర్తించలేదని పేర్కొన్నారు. తాను నిత్యం సికింద్రాబాద్ ప్రజలకు సేవ చేసేందుకు, తనను నమ్ముకున్న కార్యకర్తలకు అందుబాటులో ఉండడానికి త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని ఆయన పేర్కొన్నారు.